క్లుప్తంగా

అటవీ సంపద సంరక్షణ అందరి బాధ్యత



అధికారులతో సమీక్షిస్తున్న సబ్ డీఎఫ్ఓ రాజశేఖరబాబు

ఉదయగిరి: అటవీ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని కావలి సబ్ డీఎఫ్‌ఓ పి.రాజశేఖరబాబు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో రేంజ్ పరిధిలోని బీట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేంజ్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని అడవులు అగ్నికి ఆహుతి కాకుండా, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రేంజ్ పరిధిలోని వీఎస్ఎస్‌ల పరిధిలో కటింగ్ అయిన జామాయిల్ వివరాలు సేకరించారు. ప్లాంటేషన్లలో నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, డీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

అల్లూరు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మండలంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయ సమావేశం జరగనుందని ఆ పార్టీ నేత నీలం సాయికుమార్ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పాల్గొని 2024 ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు.

చిన్నారుల అప్పగింత

సంగం: బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న తప్పిపోయిన ఇద్దరు బాలికలను సంగం పోలీసులు వలంటీర్ సహకారంతో తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. నెల్లూరురూరల్ మండలం దొంతాలికి చెందిన తాళ్లూరు వెన్నెల, పిగళం మీనాక్షి బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. ఈ ఇద్దరు సంగం వైపు వస్తుండగా దువ్వూరు వద్ద వలంటీర్ శివ గమనించి చిన్నారులతో మాట్లాడి ఇంటికి తీసుకెళ్లారు. ఎస్సై నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

రెండు ఆలయాల్లో చోరీ

సంగం: మండలంలోని అనసూయనగర్‌లో రెండు ఆలయాల్లో చోరీ జరిగింది. గ్రామంలోని రామాలయం, వినాయకుడి గుడిలో దుండగులు, హుండీలను ఎత్తుకెళ్లి నగదు అపహరించారు. ఆలయ నిర్వాహకులు మంగళవారం ఉదయాన్నే ఆలయానికి వచ్చి చూసే సరికి తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గమనించి చోరీ జరిగిందని గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

దుత్తలూరు: మండలంలోని భైరవరంలో మంగళవారం మారెడ్డి కొండమ్మకు చెందిన పొగాకు బ్యారన్ అగ్నికి దగ్ధమైంది. పొగాకు క్యూరింగ్‌లో ఉండగా ఆకు రాలి గొట్టాలపై పడడంతో మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. అప్పటికే క్యూరింగ్‌లో ఉన్న పొగాకు, గొట్టాలు, తదితర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది.

జేసీఎస్ కన్వీనర్ కుటుంబానికి మేకపాటి పరామర్శ



పరామర్శిస్తున్న మేకపాటి

వరికుంటపాడు: మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర్లు భార్య కృష్ణకుమారి ఇరవై రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌రెడ్డి మంగళవారం వారి ఇంటికెళ్లి ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని, ప్రమాదం జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ డి.జయసింహారెడ్డి, బీసీ సెల్ నాయకులు మల్లికార్జున, వెంకటేశ్వరరెడ్డి, మధు, నారయ్య, బంగారు బాబు, భాస్కరరెడ్డి, తదితరులున్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

చేజర్ల: మండలంలోని ఎన్‌వీకండ్రిక (నూతక్కివారికండ్రిక)లో మంగళవారంరెండో రోజు వైద్య శిబిరం కొనసాగుతోంది. గ్రామంలో జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న రోగులను వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి మందులు, ఇంజక్షన్లు ఇచ్చినట్లు చిత్తలూరు పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి తెలిపారు.ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా పంచాయతీ సెక్రటరీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా అరుణాదేవి

వరికుంటపాడు: తహసీల్దార్‌గా కె.అరుణాదేవిని నియమిస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న ఆమెను ఇక్కడకు బదిలీ చేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఏవీపీ చంద్రారెడ్డిని కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

టీడీపీ రౌడీయిజంతో గెలవాలని చూస్తోంది

- టీడీపీ వాళ్లు ఇళ్లకు వచ్చి కొడుతాం అంటున్నారు..
- బహిరంగంగానే మాట్లాడుతున్న ఆ పార్టీ నేతల తీరును ప్రజలు గమనిస్తున్నారు
- కావలిలో భారీ మెజార్టీతో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తాం
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రతిజ్ఞ



మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో బీద మస్తాన్‌రావు, కొండూరు అనిల్‌బాబు

కావలి: ప్రజాదరణ కోల్పోయిన టీడీపీ ఈ దఫా ఎన్నికల్లో రౌడీయిజంతో గెలవాలని చూస్తోందని, ఆ పార్టీ నేతలకు వ్యతిరేకంగా మాట్లాడినా, పని చేసినా ఇళ్లకు వచ్చి కొడుతామని బహిరంగంగానే చెబుతున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. మీరు మా ఇళ్లకు వచ్చి కొడుతుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. ప్రశాంతమైన కావలి నియోజకవర్గంలో కొంత కాలంగా రౌడీయిజాన్ని ఆ పార్టీ నేతలు, తోక పార్టీలు ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. పిచ్చిపిచ్చి ప్రేలాపనలతో మాట్లాడితే ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. రౌడీయిజాన్ని పీచమణుస్తామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో కావలి పట్టణ, కావలి మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో ఈ దఫా భారీ మెజార్టీతో కావలిలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని శపథం చేశారు. గడిచిన నాలుగేళ్ల పది నెలలు టీడీపీ, దాని తోక పార్టీల నేతలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఎన్నికలు రావడంతో మీటింగ్‌లు పెట్టి వైఎస్సార్‌సీపీ అభిమానులను, ప్రజలను బెదిరిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి, ప్రలోభపెట్టి పబ్బం గడుపుకోవడానికి కలుగుల్లో ఉన్న పాముల్లా, ఎలుకల్లా బయటకు వస్తున్న టీడీపీ నేతలు, వారి చేష్టలను ప్రజలు గమనిస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నేత రానున్న రెండు నెలలు అత్యంత జాగ్రత్తతో ఎక్కడికక్కడ అప్రమత్తంగా ఉండి చంద్రబాబు గతంలో చేసిన మోసాలు, కొత్తగా టీడీపీ నాయకులు చేయబోయే మోసాలను ప్రజలకు వివరించి చెప్పాలన్నారు.

మితిమీరిన పచ్చడ్రామాలు

ఎన్నికల వేళ ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ కావలి నియోజకవర్గంలో మితిమీరిన పచ్చడ్రామాలకు తెరలేపిందని ఎమ్మెల్యే చెప్పారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరుతున్నట్లు రోజూ హడావుడి చేస్తున్నారన్నారు. తమ పార్టీ సిన్సియర్ నాయకులు ఎవరూ ఇతర పార్టీలోకి వెళ్లలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పనులు, పదవుల కోసం వచ్చిన వారిలో కొందరు మాత్రమే ఇతర పార్టీలోకి పోతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకులు, కార్యకర్తలు మాత్రం ఇక్కడే ఉన్నారని, వారందరికీ తాను సెల్యూట్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కావలి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు రౌడీయిజం, గూండాయిజం, దౌర్జన్యాలు చేసి ఎన్నికల్లో భయభ్రాంతులు సృష్టించాలంటే వైఎస్సార్‌సీపీ నాయకులు గాజులు తొడుక్కొని లేరని టీడీపీ నాయకులను ఎమ్మెల్యే హెచ్చరించారు. కావలి ప్రజలు చాలా శాంతి కాముకులని, బెదిరించాలని చూస్తే.. భయపడే వాళ్లు ఎవరూ లేరన్నారు. టీడీపీ నాయకులు ఇప్పడే వ్యవ్యహరిస్తున్న తీరును, రాబోయే రోజుల్లో వారి తీరును గమనించి ప్రజలు తమ ఓటు అనే ఆయుధం ద్వారా టీడీపీ నాయకులు బుద్ధి చెప్పాలని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎవరికీ భయపడాల్సిన పనిలేదు, ప్రజలకు అండగా బీద మస్తాన్‌రావు అన్నతో పాటు నేను అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కావలి పట్టణ, కావలి మండల కమిటీ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పచ్చ పత్రికలు.. టీడీపీ కరపత్రాలు

- నా ఊరులో 2 వేలు మెజార్టీ తగ్గితే రాజకీయాలకు స్వస్తి
- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బీ మస్తాన్‌రావు

కావలి: జర్నలిజం విలువలకు పచ్చ పత్రికలు పాతరేసి, టీడీపీ కరపత్రాలుగా మారాయని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మండిపడ్డారు. అనునిత్యం ఇవి రాసే తప్పుడు వార్తలను చూసి ప్రజలు మోసపోవద్దన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ చాలా బలంగా ఉందని, నా స్వగ్రామంలోనే 2 వేలు మెజార్టీ రాకపోతే రాజకీయాలకు స్వస్తి పలుకుతానని ఛాలెంజ్ చేశారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన పార్టీ నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మస్తాన్‌రావు మాట్లాడారు. పచ్చ మీడియా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై అబద్ధాల వార్తలు రాసే ఉద్యమం చేస్తున్నాయని, వాటిని పార్టీ నాయకులు కార్యకర్తలు ఎక్కడికక్కడ గట్టిగా ఖండించాలని సూచించారు. ఎన్నికలు తక్కువ సమయం ఉన్నందున నాయకులు, కార్యకర్తలు వారి ప్రాంతాల్లోనే ఉండి ఎన్నికలకు చురుగ్గా వ్యవహరించాలన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడి గెలుపునే ధ్యేయంగా పెట్టుకుని పని చేయాలన్నారు. టీడీపీలో సుదీర్ఘకాలం పని చేశానని, కానీ పని చేసే స్వేచ్ఛ కానీ, మాట్లాడే స్వేచ్ఛ లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడిగా రాజ్యసభలో కానీ, దేశ వ్యాప్తంగా ఎన్నో వేదికలపై బీసీలకు సంబంధించిన అనేక అంశాలపై గట్టిగా మాట్లాతుంటే పార్టీ ఎప్పుడూ ప్రోత్సహిస్తోందన్నారు. ఇలాంటి ఆనందం, అనుభూతి గతంలో టీడీపీలో లేదన్నారు. ఇప్పుడు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, మహిళలకు సంబంధించిన విభిన్న అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగలుగుతున్నామని బీద మస్తాన్‌రావు అన్నారు. తటస్థంగా ఉండే వారిని ఫ్యాన్‌కు ఓటేసేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు, పేదలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధిని వివరించాలని సూచించారు. పథకాల లబ్ధిదారులైన మహిళలు జగనన్నను రెండో సారి ముఖ్యమంత్రి చేసుకోవడానికి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని బీద మస్తాన్‌రావు విజ్ఞప్తి చేశారు.

పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం



విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

- జగన్ సీఎం అయితేనే అభివృద్ధి, సంక్షేమం
- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరగనుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితే అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఈ రాష్ట్రంలో పురోభివృద్ధి దిశగా పయనిస్తుందని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని విరువూరు, నార్తుకొండాయపాళెం పంచాయతీల్లో ప్రజా సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసి తండ్రికి తగ్గ తనయుడిగా పరిపాలన సాగిస్తూ ప్రజామన్ననలు పొందుతున్నారన్నారు. అర్హత ఉంటే చాలు.. పార్టీలు, ప్రాంతాలు, కులాలు, మతాలు చూడకుండా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ప్రజల వద్దకు ప్రభుత్వ పాలన అందించి జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ నాడు-నేడు పథకం ద్వారా వాటి రూపురేఖలు మార్చి నాణ్యమైన విద్య, వైద్యం అందించేలా ఎనలేని కృషి చేశారన్నారు. గత టీడీపీ పాలనలో పింఛను మంజూరు చేయాలన్నా, ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందాలన్నా జన్మభూమి కమిటీ సిఫారసుతోనే ఇచ్చేవారని, ఆ కమిటీ వ్యవస్థకు జగనన్న చెక్ పెట్టి సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రజల ఇళ్ల వద్దకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగించడానికి పేదల పక్షాన ఉన్న జగనన్నను మనమంతా ఏకమై మరోసారి దీవించి సీఎంగా చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై స్పందించే వ్యక్తినే ఎన్నికల్లో ఎన్నుకోవాలన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందంటే తమ కుటుంబ సభ్యులు ఎంపీగా, ఎమ్మెల్యేలుగా చేసిన కాలంలోనే జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనరు బొడ్డు వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులు, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, నాయకులు ఎం.తిరుపతినాయుడు, కె.రామచంద్రారెడ్డి, జి.నరసారెడ్డి, జి.శ్రీకాంత్, ఎం.మురళి పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

సీతారామపురం(ఉదయగిరి): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వలంటీరీ వ్యవస్థ దేశానికి ఆదర్శనీయంగా మారిందని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సీతారామపురంలో మంగళవారం గ్రామ వలంటీర్ల సేవలకు అవార్డు పురస్కార ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 2014లో టీడీపీ నేత చంద్రబాబు తీసుకొచ్చిన జన్మభూమి కమిటీలు పేద ప్రజలకు అన్యాయం చేసి, ఆ పార్టీ వారికే ప్రయోజనం చేశాయన్నారు. ఎంతో మంది అర్హులైన పేద వారికి పథకాలు అందక ఇబ్బంది పడ్డారన్నారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ ద్వారా పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో వలంటీర్లు క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎంతో మంది ముఖ్యమంత్రులు పాలన చేసినప్పటికీ ప్రజలకు కొండంత మేలు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ద్వారా జరిగిందన్నారు. అంతకంటే ఎక్కువ ప్రయోజనాలు వైఎస్సార్ తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి రెండో దఫా సీఎం కుర్చీలో జగన్‌ను కూర్చో బెట్టాల్సిన అవసరముందన్నారు. రెండోసారి ఆయన ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో పాటు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. పేదలకు, పెత్తందారులకు జరిగే ఈ పోరులో పేదల వైపున్న జగన్‌మోహన్‌రెడ్డిని మంచి మనస్సుతో ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఉత్తమ వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లూరురాజు, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారికి మేకపాటి ప్రత్యేక పూజలు



మేకపాటిని సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్త సూర్యనారాయణ

వరికంటపాడు: వరికుంటపాడులో నూతనంగా నిర్మించిన శ్రీగోదా పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, ధర్మకర్త ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మేకపాటిని శాలువాతో సన్మానించి, స్వామి చిత్రపటాన్ని అందించారు.

పాఠశాల ప్రహరీ, మరుగుదొడ్లు కూల్చివేత

- సోమశిల ప్రాజెక్ట్–4 ఇరిగేషన్ శాఖ నిర్వాకం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్న విద్యాశాఖ



ప్రహరీ, మరుగుదొడ్లు కూల్చివేసిన దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని 22వ వార్డు మోడల్ ఎస్టీ కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు ఫేజ్ -2 పథకం కింద మరుగుదొడ్లు, నూతన ప్రహరీ నిర్మాణం చేశారు. అయితే సోమవారం పాఠశాల ప్రాంగణంలో దక్షిణం వైపు ఉన్న ప్రహరీతో పాటు మరుగుదొడ్లు కూల్చివేసి ఉన్నాయి. 2022–23 విద్యా సంవత్సరం నుంచి 230 మందికిపైగా విద్యార్థులకు ఉపయోగంలో ఉన్న వాటిని కూల్చివేయడంతో పాఠశాల హెచ్‌ఎంతో పాటు సిబ్బంది విచారణ చేయగా పాఠశాలకు ఆనుకుని ఉన్న సోమశిల ప్రాజెక్ట్–4 ఇరిగేషన్ శాఖ అధికారులు వాటిని తొలగించినట్లు గుర్తించారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది వారిని సంప్రదించగా, దక్షిణం వైపు గోడ తమశాఖకు సంబంధించిందని, తమ కార్యాలయం చుట్టూ నూతన గోడ నిర్మిస్తున్న క్రమంలో దానిని తొలగించినట్లు చెప్పారు. దీని విషయమై ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకపోగా విద్యార్థులకు ఇబ్బందికరంగా ఇలాంటివి చేయడం సరికాదని హెచ్‌ఎం అన్నారు. జిల్లా ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు

ఆత్మకూరు: పట్టణంలోని బీఎస్సార్ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ఉన్న రహదారిలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించ వద్దని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా మెకానిక్‌లకు సూచించారు. మంగళవారం ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. మెకానిక్ దుకాణాల యజమానులతో కమిషనర్ మాట్లాడారు. మెకానిక్ షెడ్ల నిర్వాహకులు వాహనాలను రోడ్డుపై పెట్టి మరమ్మతులు చేయడం, తదితర దృశ్యాలను పరిశీలించిన ఆయన వెంటనే వాటిని తొలగించేలా దుకాణాదారులను ఆదేశించారు. రద్దీగా ఉండే ఈ దారి వెంట ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించకుండా మెకానిక్‌లు సహకరించాలని, ఇక నుంచి అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

9వ వార్డులో పరిశీలన

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర 27వ తేదీ పట్టణంలోని 9వ వార్డు ప్రాంతంలో చేయనుండడంతో ముందస్తు ఏర్పాట్లను ఆయన స్థానిక కౌన్సిలర్ కొప్పోలు రమాదేవితో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ ఖాసీం, ఏతం ప్రసాద్, వైఎస్సార్‌సీపీ రైతు నాయకుడు చిన్నపరెడ్డి, తదితరులు ఉన్నారు.

తూనికలు, కొలతల అధికారుల దాడులు

వరికుంటపాడు: వరికుంటపాడులోని పలు దుకాణాలపై మంగళవారం తూనికలు, కొలతల శాఖ కావలి డివిజన్ ఆఫీసర్ మహ్మద్‌కరీముల్లా తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. పలు దుకాణాలను తనిఖీ చేయగా వ్యాపారులు వినియోగించే ఎలక్ట్రానిక్ కాటాలకు సీల్ లేకపోవడం గుర్తించారు. సీల్ వేసి చలానా విధించారు.

పేకాట స్థావరంపై దాడులు

కొండాపురం: మండలంలోని గానుగపెంట సోషల్ ఫారెస్ట్ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలి తన సిబ్బందితో మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.20,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పేకాట రాయుళ్లు గుడ్లూరు మండలం చినపవని, పెద్దపవని గ్రామాలకు చెందిన వారని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుచన్నుట్లు తెలిపారు.